www.aakshitha.com
People's voice
# అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
## తెలంగాణ దిక్సూచి
శనివారం | 13 | జూన్ | 2026 | పేజీలు: 08



# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

**ఇండ్ల పురోగతిని అధికారులు పరిశీలించాలి**

**గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమావేశం కావాలి**

**లబ్ధిదారులు సమస్యలు పరిష్కరించాలి**

**జిల్లాలో 2,834 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి**

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై హౌసింగ్, ఎంపీడీఓలు, తహసిల్దార్లు, ఏఈలతో సమావేశం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై హౌసింగ్, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఏఈలతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శు క్రవారం జిల్లా కలెక్టర్ సమావేశ మయ్యారు. ముందుగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై మండలాల వారిగా సమీక్ష చేశారు. జిల్లాలో ..మిగతా 2లో



## పట్టాల పంపిణీతో భావితరాలకు శాశ్వత
# భూ హక్కులు



**రామచంద్రపూర్ పరిధిలో 10,600 ఎకరాల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం**

**ప్రజా దర్బార్‌లో ప్రజల సమస్యల స్వీకరణ**

**ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్లకు ప్రాధాన్యం**

**ములుగు, అక్షిత న్యూస్:** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వేగంగా పరిష్కరించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, రామచంద్రపూర్ భూములకు పట్టాల పంపిణీ ద్వారా భావితరాలకు శాశ్వత భూ హక్కులు కల్పించనున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. 99 రోజుల ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా శు క్రవారం మల్లంపల్లి మండలం రామచంద్రపూర్ గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక ప్రజా దర్బార్‌లో ..మిగతా 2లో

## సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నియమాల అమలుకు
# కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి

**మున్సిపల్ కమిషనర్లు, గ్రామీణ స్థానిక సంస్థల అధికారులు సమన్వయంతో పనిచేయాలి**

**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**





**సంగారెడ్డి అక్షిత బ్యూరో:** జిల్లాలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నియమాలను సమర్థవంతంగా అమలు చేసి పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని కల్పించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారి, జడ్పీ సీఈవో, డివిజనల్ పంచాయతీ అధికారులు, తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, పరిశ్రమలు ..మిగతా 2లో

## డ్రగ్స్, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిర్మూలనకు
# ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి

**దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి**

**వనపర్తి జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలి**

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**మాదకద్రవ్యాల బారిన పడి యువత జీవితాన్ని నాశనం చేసుకోవద్దు**

**ఎవరైనా డ్రగ్స్ అనుమానితులు ఉంటే పోలీసు శాఖకు సమాచారం ఇవ్వాలి**

**జిల్లా ఎస్పీ సునీత రెడ్డి**

**కొత్తకోటలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహణ**






**వనపర్తి అక్షిత ప్రతినిధి :** డ్రగ్స్, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహిం చాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం వనపర్తి జిల్లా కొత్తకోటలో ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ నిర్మూలన, బాల కార్మిక ..మిగతా 2లో

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

**మొదటి పేజీ తరువాయి...**

ఇప్పటిదాకా మొత్తం 7,367 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని వెల్లడించారు. 5,798 ముగ్గు పోశామని, 5,014 ఇండ్లు బేస్మెంట్ లెవెల్లో, 4,362 ఇండ్లు గోడల లెవెల్ లో, 4,012 స్లాబ్ లెవెల్ లో, 2,834 ఇండ్లు పూర్తి అయ్యాయని జిల్లా కలెక్టర్ వెల్లడించారు.

ముగ్గు పోసిన వారికి ఇంటి నిర్మాణ పనులు మొదలు పెట్టించాలని, బేస్మెంట్ వరకు పూర్తి చేసిన వారిని గోడల వరకు, అక్కడి నుంచి స్లాబ్ లెవెల్ కు, తుది దశ పనులు పూర్తి చేసేలా.. ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఎప్పటి కప్పుడు పరిశీలిస్తూ.. పనులు వేగంగా పూర్తి చేసేలా చూడాలని సూచించారు. ప్రతి ఎంపీడీఓ ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని పరిశీలించాలని, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం కావాలని మండలానికి కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లి.. ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు.

లబ్దిదారులకు ఇటుకులు ఇతర సామగ్రి అందుబాటులో ఉండేలా.. ఆయా శాఖల అధికారులు సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలని ఆదేశించారు. మేస్త్రీలు, వడ్రంగి ఇతర పని వారి వివరాలు లబ్ధిదారులకు అందుబాటులో పెట్టి ఇబ్బందులు దూరం చేయాలని సూచించారు. లక్ష్యం మేరకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో గ్రామీణ ఉపాధి హామీ పనులు వినియోగించుకునేందుకు అవకాశం ప్రభుత్వం కల్పించిందని, సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఎంపీడీఓలు ఆదేశించారు. పురోగతిలో ఉన్న ఇండ్ల ఫోటోలు ఎప్పటికప్పుడు హౌసింగ్ ఏఈలు ఆన్లైన్ లో అప్ లోడ్ చేయాలని, లబ్దిదారుల బ్యాంక్ ఖాతాల్లో ప్రతి డబ్బు జమ అవుతున్నాయని వెల్లడించారు. ఇండ్ల నిర్మాణాలకు ఎక్కడా ఇసుక కొరత లేదని స్పష్టం చేశారు. సమావేశంలో హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

## సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నియమాల అమలుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి

**మొదటి పేజీ తరువాయి...**

వైద్య ఆరోగ్య, పశుసంవర్ధక, డీఆర్డీఓ తదితర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సుప్రీంకోర్టు ఆదేశాలు, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఘన వ్యర్థాల నిర్వహణను శాస్త్రీయ పద్ధతిలో అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాలు, పట్టణాల్లో ఉత్పత్తి అయ్యే తడి, పొడి వ్యర్థాలను మూలస్థాయిలోనే వేరు చేసి సేకరించే విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నియమాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు పరిశుభ్రత కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించే చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయా మున్సిపాలిటీలలో ట్రేడ్ లైసెన్స్ ఫీజులు, ఆస్తి పన్ను వసూళ్లు, గత ఏడాది వసూళ్ల వివరాలపై మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ అడిగి తెలుసుకుని సమీక్షించారు. జిల్లాను పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నియమాలను విజయవంతంగా అమలు చేయాలని కలెక్టర్ కోరారు. అనంతరం ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడం లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన బట్ట సంచులను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ పాండు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, జడ్పీ సీఈవో జానకి రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి మల్లారెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, పరిశ్రమలు, పశుసంవర్ధక, వైద్య ఆరోగ్య, డీఆర్డీఓ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పట్టాల పంపిణీతో భావితరాలకు
# శాశ్వత భూ హక్కులు

**మొదటి పేజీ తరువాయి...**

మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.



**భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం: మంత్రి సీతక్క**

మంత్రి సీతక్క మాట్లాడుతూ రామచంద్రపూర్ గ్రామ పరిధిలో సుమారు 10,600 ఎకరాల భూములకు సంబంధించిన దశాబ్దాల నాటి సమస్యలను పరిష్కరించి, రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా రైతులకు పట్టాల పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. రైతులకు రెండు పంటలకు సరిపడా సాగునీరు అందించే ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు.

మొదటి విడతలో ములుగు నియోజకవర్గానికి 5 వేలకుపైగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని, రెండో విడతలో అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్లు అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. అర్హులైన వారికి కొత్త పెన్షన్లు మంజూరు చేసి సంక్షేమ ఫలాలు అందించనున్నట్లు తెలిపారు.

మహిళా సంఘాలకు రాష్ట్రవ్యాప్తంగా రూ.61 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందించామని, స్వయం ఉపాధి కోసం రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు కల్పిస్తున్నామని మంత్రి వెల్లడించారు. మహిళా సంఘాల వీవో భవనాలు, గోదాముల నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

**ప్రజా దర్బార్ దరఖాస్తులకు వేగవంత పరిష్కారం: కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**

జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ ప్రజా దర్బార్లో ప్రధానంగా పెన్షన్లు, ఇందిరమ్మ ఇండ్లు, భూ సమస్యలు, గ్రామస్థాయి సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. జిల్లా స్థాయిలో పరిష్కరించగల సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని, రాష్ట్ర స్థాయి అంశాలను సంబంధిత శాఖలకు పంపించి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కార్యక్రమానికి ముందు మంత్రి సీతక్క రామచంద్రపూర్ పరిధిలో రూ.44 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లు, దుర్గామాత ఆలయ కాంపౌండ్ వాల్ను ప్రారంభించారు. అనంతరం కోయగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా శానిటేషన్ డ్రైవ్లో పాల్గొన్నారు. అలాగే అంగన్వాడీ నమోదు అవగాహన ర్యాలీలో పాల్గొని పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ వికాస్ మీనా, అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జీ, ఎం. సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ బొక్క సత్తిరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామాల సర్పంచులు, తహసీల్దార్, ఎంపీడీఓ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిర్మూలనకు
# ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి

**మొదటి పేజీ తరువాయి...**

వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించేందుకు వనపర్తి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో 2కే రన్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కొత్తకోట చౌరస్తా వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన అతిథులు, ఏటీఆర్ కన్వెన్షన్ వరకు నిర్వహించిన 2కే రన్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రజలందరితో కలిసి యాంటీ డ్రగ్స్ ప్రతిజ్ఞ చేయించారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో రూపొందించిన బాల కార్మిక, బాల్య వివాహాల నిర్మూలన అవగాహన పోస్టర్లను ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, డ్రగ్స్ బారిన పడి ఎంతోమంది యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డ్రగ్స్ నియంత్రణ విషయంలో అత్యంత సీరియస్గా ఉన్నారని, ఈగల్ పేరుతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా






ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. డ్రగ్స్ను అరికట్టడం ప్రభుత్వంతో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. డ్రగ్స్కు సంబంధించిన సమాచారం అధికారులకు అందించాలని, సమాచారాన్ని గోప్యంగా ఉంచబడుతుందని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ, ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం చివరి రోజున డ్రగ్స్ నిర్మూలనపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమన్నారు. డ్రగ్స్ అనే మహమ్మారి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చుట్టుపక్కల అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై పర్యవేక్షణ ఉంచి అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. వనపర్తి జిల్లాను పూర్తిగా డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి మాట్లాడుతూ, యువత డ్రగ్స్కు దూరంగా ఉండాలని సూచించారు. యువత తెలియకుండానే డ్రగ్స్కు బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ సేవించేవారు, లేదా సరఫరా చేసేవారికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే 1908 నంబర్కు ఫోన్ చేసి తెలియజేయాలని, వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యా సంస్థలు, గ్రామాలు, కాలనీల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేసి డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ మోడల్ స్కూల్ లో చదివిన విద్యార్థినికి ఇంటర్మీడియట్లో అత్యుత్తమ మార్కులు వచ్చిన విద్యార్థినికి ముఖ్య అతిథులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాజేష్ మీనా, డీఎస్పీ గిరిబాబు, కొత్తకోట మున్సిపల్ చైర్ పర్సన్ అరుణ శ్రీనివాస్, మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రశాంత్, ఎంపీడీఓ వినీత్, సీఐ రాంబాబు, ఎస్సైలు శివానంద్ గౌడ్, వెంకటేష్ గౌడ్, పోలీసు శాఖ అధికారులు, కొత్తకోట వాకింగ్ అసోసియేషన్ల సభ్యులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, యువత మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ప్రతి బూత్ లెవల్ ఏజెంట్ పార్టీకి సైనికుడిలా పనిచేయాలి

**ఓటు చోరీ ప్రయత్నాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలి**

**ఓటర్ల జాబితానే ఎన్నికల విజయానికి తొలి అడుగు**

**వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, వర్ధన్నపేట శాసనసభ్యులు కె.ఆర్. నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి**



**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** హనుమకొండలోని అంబేద్కర్ భవన్ లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి బూత్ లెవల్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమానికి శాసనసభ్యులు కె.ఆర్. నాగరాజు తో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సార్ ప్రక్రియపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బూత్ స్థాయి నాయకులకు సమగ్ర అవగాహన కల్పించారు.

ఈ సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ దేశంలో వరుసగా నాలుగోసారి కేంద్రంలో అధికారాన్ని నిలబెట్టుకోవాలనే లక్ష్యంతో బీజేపీ ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. ప్రజల తీర్పుతో గెలిచే పరిస్థితి లేకపోతే, ఓటర్ల జాబితాల ద్వారా రాజకీయ ప్రయోజనం పొందాలనే బీజేపీ కుట్రలు జరుగుతున్నాయని విమర్శించారు.



ప్రతి బూత్ లెవల్ ఏజెంట్ అప్రమత్తంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సార్ ప్రక్రియ పేరుతో అనేక ప్రాంతాల్లో అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించే ప్రయత్నాలు జరిగాయని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఓటు వేశాం కదా అనే నిర్లక్ష్యం ప్రమాదకరమని, రేపు జాబితాలో పేరు లేకపోతే ప్రజాస్వామ్య హక్కే కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. అనంతరం డాక్టర్ కడియం కావ్య రూపొందించిన "బూత్ లెవల్ ఏజెంట్స్ సంక్షిప్త సమాచారం హ్యాండ్‌బుక్" ను ఆవిష్కరించి బి ఎల్ ఎ లు, డివిజన్ ఇన్‌చార్జ్‌లకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో , పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### పోలీస్ నియామకల కోసం సిద్ధమావుతన్న

# అభ్యర్థుల సమస్యల పరిష్కారానికి, పోదేం వీరయ్యకి వినతిపత్రం

**భద్రాచలం అక్షిత న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర పోలీస్ నియామకాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం తెలంగాణ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ పోదేం వీరయ్య గారికి వినతిపత్రం అందజేయడం జరిగింది . ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ, పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల గరిష్ట వయోపరిమితిని 36 సంవత్సరాలకు, ఎస్సై అభ్యర్థుల వయోపరిమితిని 37 సంవత్సరాలకు పెంచాలని, అలాగే రూ.20,000 పోలీస్ నియామక నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు.



గతంలో నియామకాలలో జరిగిన ఇబ్బందులు, కోవిడ్ ప్రభావం మరియు ఇతర కారణాల వల్ల అనేక మంది నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలను కోల్పోయారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తమ డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా అభ్యర్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగే లా కృషి చేస్తావని పోదాం వీరయ్య అభ్యర్థులకు హామీ ఇవ్వడం జరిగింది..

# జగిత్యాలలో షార్ట్ సర్క్యూట్‌తో భారీ అగ్నిప్రమాదం...

**జగిత్యాల అక్షితబ్యూరో:** జగిత్యాల పట్టణంలోని మార్కెట్ వెనుక ప్రాంతంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గంగాధర్ అనే కుట్టు మిషన్ల వ్యాపారికి చెందిన ఇల్లు అగ్నికి ఆహుతైంది., సమయానికి ఇంట్లో ఎవరూ లేకపోవడంతో భారీ ప్రాణనష్టం తప్పింది. సమాచారం అందుకున్న వెంటనే రెండు ఫైర్ ఇంజిన్ల తో ఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు, ఇంట్లో ఉన్న సుమారు 60 కొత్త కుట్టు మిషన్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో దాదాపు రూ. 8 లక్షల మేర నష్టం జరిగినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.



# ప్లాస్టిక్ నిషేధం, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలి

**ప్లాస్టిక్ రహిత సంగారెడ్డి నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి**

**మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్**



**సంగారెడ్డి అక్షిత బ్యూరో:** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనలను సమర్థవంతంగా అమలు చేయాలని సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్ పిలుపునిచ్చారు. గురువారం సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో కలిసి ప్లాస్టిక్ నిషేధం, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారిణి విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పర్యావరణానికి తీవ్ర హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా నిలిపివేసి, వాటికి బదులుగా పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించాలని సూచించారు. అలాగే సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనల ప్రకారం తడి, పొడి, హానికర వ్యర్థాలను మూలస్థాయిలోనే వేర్వేరుగా సేకరించి, శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించడం ద్వారా పరిశుభ్రమైన పట్టణాల నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. సదస్సులో భాగంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో వ్యాపార సంఘాల ప్రతినిధులకు బట్ట సంచులను పంపిణీ చేసి, ప్లాస్టిక్ క్యారీ బ్యాగులకు ప్రత్యామ్నాయంగా వాటి వినియోగాన్ని ప్రోత్సహించారు. ప్లాస్టిక్ రహిత సంగారెడ్డి లక్ష్య సాధనకు వ్యాపారవేత్తలు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు సమష్టిగా కృషి చేయాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కిరాణా దుకాణాల సంఘం ప్రతినిధులు, బేకరీ షాప్ అసోసియేషన్ సభ్యులు, వ్యాపారవేత్తలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మాక్లూర్ నూతన ఎస్సైని కలిసిన సర్పంచ్‌లు.....!



**ఆర్మూర్, అక్షిత ప్రతినిధి:** మాక్లూర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సబ్ ఇన్‌స్పెక్టర్ అనిల్ రెడ్డి ని డికంపల్లి, కల్లడి, చిన్నపూర్ గ్రామాల సర్పంచ్‌లు మరియు స్థానిక నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డికంపల్లి సర్పంచ్ మచ్చర్ల చిన్నయ్య, కల్లడి సర్పంచ్ గంగోల్ల సుస్మిత--ప్రళయ్ తేజ్, చిన్నపూర్ సర్పంచ్ పుప్పాల చిన్నతో పాటు నాయకులు గంగోని వినోద్ కుమార్ ఎస్సై అనిల్ రెడ్డికి శాలువా కప్పి సన్మానించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం, శాంతిభద్రతల పరిరక్షణకు తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

అనంతరం ఎస్సై అనిల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మచ్చర్ల చిన్నయ్య, గంగోల్ల ప్రళయ్ తేజ్, పుప్పాల చిన్న, గంగోని వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 3,4 జోన్ల అధికారులు సిబ్బందికి గ్రీవెన్స్ నిర్వహించిన వరంగల్ సిపి



**వరంగల్, అక్షిత బ్యూరో:** 3,4 జోన్ల పరిధిలో విధులు నిర్వహించే పోలీసు అధికారులు సిబ్బందికి సంబంధించిన శాఖ పరమైన సమస్యలపై ఇంచార్జ్ డిఐజి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, శుక్రవారం వరంగల్ రేంజ్ కార్యాలయంలో పోలీస్ సిబ్బందికి గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పదోన్నతులు, బదిలీలు, శాఖపరమైన క్రమశిక్షణ చర్యలకు సంబంధించి సిబ్బంది అధికారులు అందజేసిన దరఖాస్తులను వరంగల్ పోలీస్ కమిషన్ పరిశీలించారు.

# "మన బడి - మన బాధ్యత, స్వచ్ఛ పాఠశాల" కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్




**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపుమేరకు కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 2వ డివిజన్ తీగలగుట్టపల్లిలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించనున్న "మన బడి – మన బాధ్యత, స్వచ్ఛ పాఠశాల" కార్యక్రమ ఏర్పాట్లను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన టిఫిన్ బైఠక్‌లో డివిజన్ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాఠశాల ఆవరణతో పాటు పరిసర ప్రాంతాలను సందర్శించి పరిశుభ్రత, పారిశుధ్య ఏర్పాట్లను సమీక్షించారు. పాఠశాలలు పరిశుభ్రంగా ఉండటం విద్యార్థుల ఆరోగ్యానికి, విద్యాభివృద్ధికి ఎంతో అవసరమని మేయర్ పేర్కొన్నారు.నేడు నిర్వహించనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం మేయర్ కొలగాని శ్రీనివాస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి అల్పాహారం (బ్రేక్‌ఫాస్ట్) చేశారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలు, డివిజన్ అభివృద్ధి అంశాలపై కూడా చర్చించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలీసులంటే భరోసా, భయం వుండాలి

## వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్




**వరంగల్, అక్షిత బ్యూరో:** పోలీసులు అంటే సాధారణ ప్రజలు, బాధితులకు భరోసా, నమ్మకం కలిగించాలి, అదే తప్పు చేసిన, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వారికి పోలీసులంటే భయం కలగాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో వివిధ విభాగాల్లో నూతనంగా భాధ్యతలు చేపట్టిన హన్మకొండ ట్రాఫిక్ ఇన్స్ స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, టాస్క్ ఫోర్స్ ఇన్స్ స్పెక్టర్ సుబ్బారెడ్డి, ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ ఇన్స్ స్పెక్టర్ చేరాలు శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ను మర్యాదపూర్వకంగా కలుసుకొని మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రజలు మనపై వుంచిన నమ్మకానికి తగ్గట్లు పనిచేయాలని, పారదర్శకంగా విధులు నిర్వహించాలని సీపీ సూచించారు.

## "ఏక్ పెడ్ మా కే నామ్ (అమ్మ పేరుతో)

# మొక్కను నాటాలి

### జాతీయ విద్యార్థి పర్యావరణ కార్యక్రమ 2026 వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ డా. సత్యశారద




**వరంగల్, అక్షిత బ్యూరో:** వరంగల్ కలెక్టరేట్‌లో పర్యావరణ పరిరక్షణ, హరితహారం కార్యక్రమ విస్తరణ, విద్యార్థుల్లో ప్రకృతి పట్ల బాధ్యతాభావం పెంపొందించడమే లక్ష్యంగా తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ జిల్లా విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న "ఏక్ పెడ్ మా కే నామ్ (అమ్మ పేరుతో మొక్కను నాటడం) 2026" జాతీయ స్థాయి విద్యార్థి పర్యావరణ పోటీ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ డా. సత్యశారద, ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి తన తల్లి పేరుతో ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించడం ద్వారా ప్రకృతితో అనుబంధాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. "ఏక్ పెడ్ మా కే నామ్" కార్యక్రమం పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటమే కాకుండా, విద్యార్థుల్లో బాధ్యతాభావం, సేవా భావం, ప్రకృతి ప్రేమను పెంపొందించే ఉద్యమంగా మారాలని ఆమె పేర్కొన్నారు.

మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి మొక్కను జీవంగా భావించి కాపాడాల్సిన అవసరం ఉందని ఆమె సూచించారు. పాఠశాలలు, కళాశాలలు ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టి విద్యార్థులను భాగస్వాములను చేయాలని కలెక్టర్ సూచించారు. తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈ జాతీయ స్థాయి పోటీలో విద్యార్థులు, కళాశాల విద్యార్థులు, పరిశోధకులు, యువతతో పాటు సాధారణ ప్రజలు కూడా పాల్గొనవచ్చని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడం, సీడ్ బాల్స్ తయారీ, పర్యావరణ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, వాటి ఫోటోలు మరియు వివరాలను నిర్దిష్ట పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడం ద్వారా పోటీలో పాల్గొనవచ్చని వివరించారు.

జిల్లాలో పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా "హరిత వరంగల్" నిర్మాణానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు. ప్రతి విద్యాసంస్థ ఈ కార్యక్రమాన్ని ఉద్యమాత్మకంగా తీసుకొని అమలు చేయాలని పిలుపునిచ్చారు.

జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు ఈ కార్యక్రమంలో విస్తృతంగా పాల్గొని విజయవంతం చేయాలని అధికారులు కోరారు. పర్యావరణ పరిరక్షణను విద్యార్థుల దైనందిన జీవితంలో భాగంగా మార్చడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ యూ. సుజన్ తేజ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. సాంబశివరావు, జిల్లా కోఆర్డినేటర్ డా. కట్ల శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తోపాజి అనంత కిషన్ ప్రమాణ స్వీకారం

### ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం సమిష్టిగా కృషి చేస్తానని వెల్లడి





**సంగారెడ్డి అక్షిత బ్యూరో:** ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సంగారెడ్డి జిల్లాకు చెందిన ప్రముఖ సామాజికవేత్త తోపాజి అనంత కిషన్ ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్‌లోని చంపాపేటలో ఉన్న సామ సరస్వతి గార్డెన్స్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి టీజీ వెంకటేష్ సమక్షంలో ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా పలువురు ఆర్యవైశ్య నాయకులు, సామాజిక ప్రముఖులు, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొని తోపాజి అనంత కిషన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం తోపాజి అనంత కిషన్ మాట్లాడుతూ, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవిని గౌరవంగా భావిస్తూ, రాష్ట్రంలోని ఆర్యవైశ్యుల అభ్యున్నతి, సంక్షేమం, విద్య, ఉపాధి, యువత సాధికారత కోసం తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. సంఘంలో ఐక్యతను మరింత బలోపేతం చేసి, సామాజిక సేవా కార్యక్రమాలను గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు విస్తరించే దిశగా కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరావతి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, సేవా దృక్పథం కలిగిన తోపాజి అనంత కిషన్‌కు రాష్ట్ర ఉపాధ్యక్ష బాధ్యతలు రావడం సమాజానికి ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఆయన నాయకత్వంలో ఆర్యవైశ్య మహాసభ కార్యకలాపాలు మరింత విస్తరిస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర, జిల్లా నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, ఆర్యవైశ్య ప్రముఖులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపాజి అనంత కిషన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

# పాఠశాల పునఃప్రారంభానికి ముందే అన్ని సౌకర్యాలు సిద్ధంగా ఉండాలి

### అదనపు కలెక్టర్ డాక్టర్ అశ్వని తానాజీ వాకడే



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** పాఠశాల పునఃప్రారంభానికి ముందే అన్ని సౌకర్యాలు సిద్ధంగా ఉండాలని అదనపు కలెక్టర్ డాక్టర్ అశ్వని తానాజీ వాకడే అన్నారు.పాఠశాల పునఃప్రారంభ కార్యక్రమంలో భాగంగా ఎలగందల్, కొత్తపల్లి మండలంలోని విద్యాసంస్థలను అదనపు కలెక్టర్ సందర్శించి మౌలిక వసతుల పరిస్థితిని పరిశీలించారు.ఈ సందర్భంగా ఎలగందల్ మోడల్ స్కూల్, జడ్పీహెచ్ఎస్ హైస్కూల్, కేజీబీవీ, సాంఘిక సంక్షేమ హాస్టళ్లను సందర్శించిన ఆమె, అక్కడ విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, భవనాల మరమ్మతులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ ఇతర సౌకర్యాలపై సమీక్ష నిర్వహించారు.పరిశీలనలో గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేసి, పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి అన్ని వసతులతో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విద్యాసంస్థలను సన్నద్ధం చేయడం అధికారుల బాధ్యత అని పేర్కొన్న అదనపు కలెక్టర్, ప్రతి పనిని నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో టీజీడబ్ల్యూఐడీసీ ఈఈ అశోక్ కుమార్ ప్లానింగ్ సమన్వయాధికారి మిలుకూరి శ్రీనివాస్, కొత్తపల్లి మండల విద్యాధికారి తుమ్మా ఆనందం తదితరులు పాల్గొన్నారు.

# అటవీశాఖ కనుసన్నల్లోనే ఆముదాలపల్లి

**అడవి తల్లి ఆశ్రయం ఇచ్చింది**

**అధికారులు దయ చూపాలి**

**అభివృద్ధికి దూరంగా ఆముదాలపల్లి**

**అటవీ గ్రామం కావడమే ఆ గ్రామ ప్రజల శాపం**

**తట్టెడు మట్టి తీయాలన్న అటవీ శాఖ అధికారుల అనుమతి తప్పనిసరి**

**రెవెన్యూ గ్రామ పంచాయతీగా మారితేనే మాకు బతుకు అంటుకున్న గ్రామస్తులు**

**అక్షిత ప్రతినిధి భూపాలపల్లి:** ఒకప్పుడు అదొక దట్టమైన అటవీ ప్రాంతం..మెల్లిగా మెల్లిగా ప్రజలు ఆవాసాలు ఏర్పరచుకోవడం తో ఇప్పుడు ఒక గ్రామపంచాయతీగా రూపాంతరం చెందింది..దాదాపు 45 ఏళ్ల క్రితం నుండే ఇక్కడ ప్రజలు నివాసాలు ఏర్పరచుకొని,పోడు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు..చిమ్మ చీకటిలో చుట్టూ పురుగుపుట్ర తో సహజీవనం చేసిన ఆ ఊరి ప్రజల బ్రతుకులు కాలక్రమేనా మారిన వారి తలరాతలు మాత్రం మారడం లేదు...ఒకప్పుడు కమలాపూర్ గ్రామ పంచాయతీ కింద ఆమ్లెట్ విలేజ్ గా ఉన్న ఊరు ఇప్పుడు సొంత గ్రామ పంచాయితీగా మారిన అక్కడ నివాసం ఉంటున్న ప్రజలకు ఎలాంటి లాభం లేకుండా పోయింది..అన్ని ఉన్న అల్లుని నోట్లో శని అన్న చందంగా తయారైన ఆముదాలపల్లి గ్రామం పై ప్రత్యేక కథనం..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా లో ఉన్న ఆముదాలపల్లి గ్రామ ప్రజలు ఇప్పుడు ఒక్కటే






కోరుకుంటున్నారు..అది తమ ఊరును రెవెన్యూ గ్రామ పంచాయతీ గా మార్చాలని, అలాగైతేనే తమ బ్రతుకులు బాగుపడతాయని అక్కడి ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు..ఇప్పటికీ తమ గ్రామంలో ఎలాంటి పనులు జరగాలన్న అటవీశాఖ అనుమతులు కావాలని వారు వాపోతున్నారు..దాదాపు 45 ఏళ్ళ క్రితమే ఆముదాలపల్లి చాలా కుటుంబాలు వలస వచ్చి స్థిర నివాసం ఏర్పర్చుకున్నారు, కాలక్రమేనా ఇక్కడ జనజీవనం పెరిగి ప్రస్తుతం 120 ఇల్లు సుమారు 500 నుండి 1000 జనాభా తో ఈ ప్రాంతం



అభివృద్ధి చెందింది..దట్టమైన అటవీ ప్రదేశం అనే కారణం తో అటవీ శాఖ అధికారులు ఈ ప్రాంత అభివృద్ధికి సహకరించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు..కనీసం సైడ్ కాలువలో చెత్త తీయాలన్న కూడా అటవీ శాఖ అధికారుల అనుమతి కావాలని వాపోయారు..దాదాపు 40 ఏళ్ల క్రితం కొట్టుకున్న పోడు భూములకు ఇప్పటికీ పట్టాలు రాలేదని, దీని ద్వారా ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు..భూములకు పట్టాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు..కనీసం పంటలు పండించడానికి పోలాల్లో బోర్లు వేయించిదామన్న అనుమతులు రాక అరిగోసలు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు..ఒకవేళ ఎలాగోలా కష్టపడి పంటను పండిస్తే,పండించిన పంటను అమ్మాలన్న తిప్పలు తప్పడం లేదన్నారు..

**రెవెన్యూ గ్రామంగా మారితేనే మాకు భవిష్యత్తు-సర్పంచ్ ఇచ్చంతల విష్ణు**

2018 లో ఆముదాలపల్లి గ్రామ పంచాయతీగా మారిందని కానీ అభివృద్ధి మాత్రం జరగడం లేదని సర్పంచ్ విష్ణు తెలిపారు.. అటవీ శాఖ పరిధిలో ఉన్న తమ గ్రామం రెవెన్యూ గ్రామంగా మారితేనేబాగు పడుతుందన్నారు...ఆముదాలపల్లి గ్రామాన్ని రెవెన్యూ గ్రామ పంచాయతీగా మార్చాలని ఎమ్మెల్యే ను, కలెక్టర్ ను కలిశామన్నారు..ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామాన్ని రెవెన్యూ గ్రామ పంచాయతీగా మార్చాలన్నారు...

# గ్రామ పంచాయతీ కార్మికుల ఆగ్రహం..

**జూలై 1లోపు వేతనాలు ఇవ్వకపోతే నిరవధిక సమ్మె హెచ్చరిక**

**నాలుగు నెలలుగా జీతాలు లేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు**

**ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్**

**కనీస వేతనం రూ. 26 వేలు, పెండింగ్ వేతనాల విడుదల కోరుతూ ధర్నా**

**జిల్లా కలెక్టరేట్ ఎదుట కార్మికుల నిరసన**




**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో :** గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేసి, ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట కార్మికులు పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఆందోళనలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు కార్మిక సంఘాల నాయకులు తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ కార్మికులు గత నాలుగు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబాల పోషణ, పిల్లల చదువులు, నిత్యావసర ఖర్చులు భారంగా మారాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పలుమార్లు ప్రతి నెల ఒకటో తేదీన గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు చెల్లిస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు అమలు కాలేదని విమర్శించారు.

రాష్ట్రంలోని 12,790 గ్రామ పంచాయతీల్లో సుమారు 53 వేల మంది కార్మికులు గ్రామాల పరిశుభ్రత, పచ్చదనం కోసం తమ ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా పనిచేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కనీస వేతనం అమలు, మల్టీ పర్పస్ విధానం రద్దు, కార్మిక సమస్యల పరిష్కారం వంటి హామీలు ఇచ్చిందని, రెండున్నర సంవత్సరాలు గడిచినా వాటిలో ఏ ఒక్కటి కూడా అమలు కాలేదని ఆరోపించారు.

గ్రామ పంచాయతీ కార్మికులకు నెలకు కనీస వేతనం రూ. 26 వేలుగా నిర్ణయించాలని, పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

జూలై 1 నాటికి వేతనాలు చెల్లించకపోతే రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్మికులు నిరవధిక సమ్మెకు దిగుతారని హెచ్చరించారు. ప్రభుత్వం స్పందించి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

# హత్యకు స్కెచ్ వేశారు దొరికిపోయారు

**ప్రియుడితో కలిసి భర్తపై హత్యాయత్నం**

**భార్యతో పాటు ఆమె ప్రియున్ని అరెస్ట్ చేసిన టేకుమట్ల పోలీసులు..**



**అక్షిత ప్రతినిధి భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెంకట్రావుపల్లి (బి) గ్రామంలో భర్తను కరెంట్ షాక్‌తో హత్య చేసేందుకు యత్నించిన కేసులో భార్య లక్ష్మి, ఆమె ప్రియుడు ఈర్ల రాజును పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు టేకుమట్ల ఎస్సై అమూల్య మీడియాకు వివరాలు వెల్లడించారు..లక్ష్మీ భర్త బచ్చల చిన్న రవి తన భార్యను ప్రియుడితో సన్నిహితంగా ఉండవద్దని హెచ్చరించడంతో భార్య భర్తల నడుమ తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో జూన్ 9న రాత్రి లక్ష్మి తన ప్రియుడు రాజుని ఇంటికి పిలిచి ఇద్దరు కలిసి కరెంట్ వైర్లు మంచానికి చుట్టి నిద్ర పోతున్న తన భర్త రవి కాళ్లకు చుట్టే ప్రయత్నం చేయగ అలికిడి కి తను లేచి అరవటంతో చుట్టు పక్కల వాళ్లు కూడా రావడంతో ఇద్దరు కలిసి పారిపోయారు. ఈ నేపథ్యం లో భర్త రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితురాలు లక్ష్మి నీ ఆమె ప్రియుడుని అదుపులోకి తీసుకుని వారిని రిమాండ్ కు తరలించినట్లు టేకుమట్ల ఎస్సై అమూల్య తెలిపారు.

# జాతీయ లోక్ అదాలత్ లో పెద్ద ఎత్తున కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

**పోలీసు అధికారులు, న్యాయవాదులకు సూచించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.వి.పి. సూర్యచంద్రకళ**





**అక్షిత ప్రతినిధి భూపాలపల్లి:** జూన్ ఇరవై తేదీన నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్ లో పెద్ద ఎత్తున కేసుల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్పర్సన్, ప్రధాన న్యాయమూర్తి ఎస్.వి.పి. సూర్యచంద్రకళ సూచించారు.

పోలీసు అధికారులు, న్యాయవాదులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.వి.పి. సూర్యచంద్రకళ శుక్రవారం వేరు వేరుగా సమావేశాన్ని నిర్వహించారు. కేసుల పరిష్కారంలో రాజీ మార్గాన్ని ప్రోత్సహించాలని వారు అన్నారు. జాతీయ లోక్ అదాలత్ లో కేసులోని ఇరువర్గాలవారు స్నేహపూర్వక వాతావరణంలో తమ కేసులను పరిష్కారం చేసుకుంటే విలువైన సమయం, డబ్బులు వృధా కావని, మనశాంతిని పొందవచ్చని పేర్కొన్నారు, సివిల్ కేసుల్లో రాజి పడ్డవారికి కోర్టు ఫీజు కట్టినచో, తిరిగి ఇవ్వబడుతుందని జడ్జి తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.అఖిల , గవర్నమెంట్ ప్లీడర్ బోట్ల సుధాకర్, అడిషనల్ ఎస్.పి., ఏ.నరేష్ కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏదులాపురం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఆకుల రాములు, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఇందరపు శివకుమార్, డి.ఎస్.పి లు సంపత్ రావు, సూర్యనారాయణ, ఎక్సయిజ్ అధికారులు, సి.ఐ లు, ఎస్సై లు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ పుప్పాల శ్రీనివాస్, న్యాయవాదులు కే. చిరంజీవి, రత్నం కిరణ్, మొయినుద్దీన్, వసంత, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది, కోర్టు కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు..

# సామిల్ యజమానుల సమస్యల పట్ల సానుకూల స్పందన

## ఫారెస్ట్ రేంజర్ ఆదిత్య



**కోదాడ అక్షిత ప్రతినిధి:** కోదాడ సామిల్ టింబర్ డిపో నూతన కార్యవర్గం, నూతన అధ్యక్షులు చెన్నమల్లు నరసింహ చారి అధ్యక్షతన ఫారెస్ట్ రేంజ్ ఆఫీసులో ఫారెస్ట్ అధికారులను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు చెన్నమల్లు నరసింహ చారి సామిల్ టింబర్ డిపో సమస్యలు అధికారులకు వివరించగా వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.అనంతరం ఫారెస్ట్ రేంజర్ ఆదిత్య, మరియు సెక్షన్ ఆఫీసర్ ఖదీర్ లను శాలవా బొకేలతో ఘనంగా సత్కరించడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు గొల్లపల్లి అనిల్, గౌరవ సలహాదారులు పమ్మి ఉపేంద్ర చారి, ప్రధాన కార్యదర్శి కొల్లూరు వేణు, కోశాధికారి గొల్లపల్లి బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ బాలికల ఎస్ఎంహెచ్ హాస్టల్ మంథనిలో పునః ప్రారంభించాలి

## ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆర్ల సందీప్



**పెద్దపల్లి అక్షిత ప్రతినిధి:** ఎస్సీ బాలికల (ఎస్ఎంహెచ్) హాస్టల్లో తరలింపు మంథని విద్యార్థుల భవిష్యత్తు అనే అంశంపై లిఎస్ఎఫ్ఐలి ఆధ్వర్యంలో లిమండల అధ్యక్షుడు బందెల రాజ్ కుమార్లి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి డివైఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ రైతు సంఘం, ఐ డి సి ఎస్ స్వచ్ఛంద సంస్థ, ,దళిత ఐక్యవేదిక,విద్యార్థి జేఏసీ నాయకులు పాల్గొనడం జరిగింది ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా లిఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్లి హాజరై మాట్లాడుతూ మంథనిలో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాడి తెచ్చుకున్న ఎస్ఎంహెచ్ హాస్టల్లోనూ ఏఎస్డబ్ల్యు మరియు డిఎస్డిఓ గారు మూసివేసే దిశగా ప్రయత్నాలు చేస్తూ మంథని విద్యార్థులకు చదువును దూరం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. గత సంవత్సరం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటాలు చేయడం వల్ల ఎస్సీ బాలికల ఎస్ఎంహెచ్ హాస్టల్ కు ఇండివిడ్యుయల్ వార్డెన్ కేటాయించడం జరిగిందన్నారు అప్పటినుంచి ఇప్పటివరకు ఏ విద్యార్థిని కూడా తీసుకోకుండా హాస్టల్లో మూసివేసే దిశగా ఇన్చార్జి తీసుకున్న వార్డెన్ ప్రయత్నాలు చేసిందన్నారు విద్యా సంవత్సరం ప్రారంభంలోనే హాస్టల్ తీసుకుపోయి పెద్దపల్లి లో నెలకొల్పారు అంటే మంథని లోని పేద విద్యార్థులకు చదువును దూరం చేసే విధంగా ఎస్ డబ్ల్యూ మరియు డిఎస్డిఓ గారు చూస్తున్నారు గతంలో కూడా ఇక్కడున్నటువంటి ఏ ఎస్ డబ్ల్యూ కార్యాలయాన్ని తరలించి ఇక్కడి నుండి పేద ప్రజలకు అందుబాటులో లేకుండా చేయడం జరిగింది అలాగే ఇక్కడున్నటువంటి ఎస్సీ బాలికల ప్రీమెట్రిక్ హాస్టల్ ను కూల్చివేసి అక్కడ మున్సిపల్ ఆఫీస్ కు స్థలాన్ని కేటాయించడం జరిగింది ఇక్కడున్నటువంటి ఎస్సీ డిపార్ట్మెంట్ కి సంబంధించిన హాస్టలను మూసివేసి దిశగా డిఎస్డిఓ గారు వ్యవహరిస్తున్నారని అన్నారు మంథని నుండి హాస్టల్లో పెద్దపల్లి తరలిస్తా ఉంటే మరి మంత్రి గారు ఎందుకు స్పందించడం లేదని మరి హాస్టల్లో తరలింపు మంత్రిగారికి తెలిసే జరుగుతుందా అని వారు ప్రశ్నించారు మంథని నుంచి తరలించిన హాస్టల్ను వెంటనే మంథనిలో పునః ప్రారంభించి ఇక్కడ ఉన్నటువంటి పేద విద్యార్థుల చదువుకు తోడ్పడాలని మంత్రి గారిని కోరారు లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంత్రిగారి కార్యాలయాన్ని మరియు జిల్లా వ్యాప్త ఉద్యమాలకు పిలుపునిస్తామని వారు హెచ్చరించారు ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్ ,ఐ డి సి ఎస్ వ్యవస్థాప అధ్యక్షుడు ఎల్పుల సురేష్, తెలంగాణ రైతు సంఘం నాయకులు రాపల్లి తిరుపతి, దళిత ఐక్యవేదిక నాయకుడు బూడిద తిరుపతి, విద్యార్థి జేఏసీ నాయకుడు బెజ్జంకి దిగంబర్ పాల్గొన్నారు.

# ఆర్గానిక్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తాం



## ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్ నగర్, అక్షిత న్యూస్:** ఆర్గానిక్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తామన్నారు ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి మహబూబ్ నగర్ నగరం లోని పాలమూరు గో ఆధార్ ఫార్మర్స్ మ్యూచువల్లి ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత కాలంలో వ్యవసాయంలో అధికంగా రసాయనాల వినియోగం వల్ల నేల నాణ్యత తగ్గిపోవడం, ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో రసాయనాలు, చీడపీడల మందులు వాడకుండా ఆర్గానిక్ పద్ధతిలో పంటలను పండించడం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. ఆర్గానిక్ వ్యవసాయం ద్వారా పండించిన పంటలు ఆరోగ్యకరంగా ఉండటంతో పాటు మార్కెట్లో కూడా మంచి డిమాండ్ కలిగి ఉంటాయని, రైతులు ఈ విధానాన్ని అవలంబించడం ద్వారా వారి ఆదాయం కూడా పెరగడమే కాకుండా సమాజానికి ఆరోగ్యకరమైన ఆహారం అందించవచ్చు అని తెలిపారు.

ఆర్గానిక్ వ్యవసాయ సాగు దిశగా రైతులందరికీ అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే ఆర్గానిక్ పంటల మార్కెటింగ్‌కు తగిన సౌకర్యాలు కల్పించడంతో పాటు రైతులు సమూహాలుగా ఏర్పడి కలిసి పనిచేయాలని ఆయన సూచించారు. ప్రతి గ్రామంలో ఆర్గానిక్ వ్యవసాయంపై చైతన్యం పెంచుతూ, పండించిన పంటలను నేరుగా వినియోగదారులకు అందించే విధానాన్ని అభివృద్ధి చేయాలని, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్గానిక్ ఆహారం వినియోగాన్ని ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు.





రాబోయే రోజుల్లో రైతులు, అధికారులు కలిసి సమన్వయంతో పనిచేసి ఆర్గానిక్ వ్యవసాయాన్ని విస్తరించే దిశగా కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఆర్గానిక్ వ్యవసాయం చేసేవారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అంతకుముందు ఆయన ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, పాలమూరు గో ఆధార్ ఫార్మర్స్ మ్యూచువల్లి ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సభ్యులు ముకుంద రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, వినోద్ కుమార్, రాజ్ గోపాల్ గౌడ్, దామోదర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అరుణ్ కుమార్ రెడ్డి , వ్యవసాయ మరియు హార్టికల్చర్ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నైపుణ్యాభివృద్ధిపై గీతం విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

**పటాన్‌చెరు అక్షిత ప్రతినిధి:** నైపుణ్యాభివృద్ధి, కెరీర్ అభివృద్ధి, పరిశ్రమకు సంసిద్ధత, ప్రపంచ ఉన్నత విద్యపై అవగాహనను విద్యార్థులలో పెంపొందించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 'జూన్ 2026 సెషన్ సిరీస్' పేరిట ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ విషయాన్ని గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ (జీసీజీసీ)లోని శిక్షణ, మార్గదర్శకత్వం వృత్తిపరమైన సలహాలు (టీఎంసీజీ) డైరెక్టర్ డాక్టర్ రోజీనా మాథ్యూ శుక్రవారం విడుదల చేసి ఒక ప్రకటనలో వెల్లడించారు.విజయవంతమైన పూర్వ విద్యార్థులు, పరిశ్రమ నిపుణులు, పరిశోధకులు, విభిన్న రంగాలకు చెందిన నిపుణులతో గీతం విద్యార్థులను అనుసంధానించడంలో టీఎంసీజీ వేదిక కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఈ పరస్పర సంభాషణల ద్వారా, విద్యార్థులు తరగతి గది అభ్యాసానికి తోడ్పడే ఆచరణాత్మక అంతర్దృష్టులను పొందుతారని, ఇవి వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రపంచంలో విజయవంతమైన కెరీర్ల కోసం వారిని సిద్ధం చేస్తారని వివరించారు.'జూన్ 2026 సెషన్ సిరీస్'లో, ప్రముఖ పూర్వ విద్యార్థులు, పరిశ్రమ నిపుణులు వర్ధమాన కెరీర్ అవకాశాలు, విదేశాలలో ఉన్నత విద్య, కృత్రిమ మేధస్సు (ఏఐ), ప్రొడక్ట్ మేనేజ్ మెంట్, డేటా అనలిటిక్స్ వంటి అంశాలపై తమ అభిప్రాయాలను, నైపుణ్యాన్ని గీతం విద్యార్థులతో పంచుకుంటారని ఆమె పేర్కొన్నారు.ఇందులో భాగంగా, జూన్ 11న, 'సరిహద్దులకు ఆవల: అమెరికాలో కృత్రిమ మేధస్సు అధ్యయన ప్రయాణం'




అనే అంశంపై యూనివర్సిటీ ఆఫ్ సిన్సినాటి మాస్టర్స్ విద్యార్థిని శ్రీజ నల్లమోతు ప్రసంగిస్తారని తెలిపారు. జూన్ 12న, 'సరిహద్దులకు ఆవల: విదేశాలలో ఉన్నత విద్యకు మీ ప్రయాణం' అనే అంశంపై యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ ఎట్ డల్లాస్ పట్టభద్రుడు హార్దిక్ మల్లిచెట్టి ఉపన్యసిస్తారన్నారు. జూన్ 14న, 'ఉత్పత్తి సంబంధిత పాత్రలను' గ్లోబల్ డేటా పీఎల్సీ ప్రొడక్ట్ అనలిస్ట్ వంశిక సాయి బొత్స పరిచయం చేస్తారని వెల్లడించారు. జూన్ 15న, 'యూనివర్సిటీ ఆఫ్ హ్యూస్టన్ కు ప్రయాణం' అనే అంశంపై అక్కడి రీసెర్చ్ అసిస్టెంట్ ఆకాంక్ష గోవిందరాజు వివరిస్తారన్నారు. జూన్ 21న, 'డేటా అనలిటిక్స్ భవిష్యత్తును నడిపించడం: కృత్రిమ మేధస్సు, నైపుణ్యాలు, కెరీర్' అనే అంశంపై ఎంఎస్డీ డేటా సైన్స్ మేనేజర్ సమీక్ష నిమ్జే ఉపన్యసిస్తారని తెలిపారు. జూన్ 23న, 'విదేశాలలో ఉన్నత విద్యలో చేరడానికి సరైన సమయాన్ని విశ్లేషించడం'పై నార్త్ కరోలినా స్టేట్ యూనివర్సిటీ మాస్టర్స్ విద్యార్థిని ఎన్.శ్రేయారెడ్డి సలహాలిస్తారన్నారు. జూన్ 26న, 'స్పష్టతతో, లక్ష్యంతో విదేశాలలో ఎలా చదువుకోవాలి' అనే అంశంపై పోలాండ్ లోని కోజ్మిన్స్కి విశ్వవిద్యాలయం మాస్టర్స్ విద్యార్థి సాయిరామ్ నాగేష్ మార్గదర్శనం చేస్తారని తెలియజేశారు.వీటి ముఖ్య ఉద్దేశం, విద్యార్థులకు అభివృద్ధి చెందుతున్న పరిశ్రమ పోకడలను అర్థం చేసుకోవడం, ప్రపంచవ్యాప్త విద్యావకాశాలను అన్వేషించడం, విదేశాలలో పనిచేస్తున్న, చదువుతున్న పూర్వ విద్యార్థుల నుంచి లోతైన అవగాహనను పొందడం, వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాలలో విజయవంతమైన వృత్తి జీవితానికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవడంలో సహాయపడటమని డాక్టర్ రోజీనా వివరించారు.ఆయా సెషన్లలో విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని, వక్తలతో సంభాషించాలని, అలాగే తమ విద్య, వృత్తి జీవితాల గురించి సరైన నిర్ణయాలు తీసుకోవాలని డాక్టర్ మాథ్యూ విద్యార్థులను ప్రోత్సహించారు. "విద్యార్థులు అనుసరించాలనుకుంటున్న మార్గంలో ఇప్పటికే విజయవంతంగా పయనించిన వ్యక్తుల నుంచి నేర్చుకోవడానికి ప్రతి సెషన్ ఒక అవకాశాన్ని అందిస్తుంది. ఈరోజు తీసుకునే నిర్ణయాలే రేపటి అవకాశాలను తీర్చిదిద్దుతాయి" అని ఆమె అన్నారు. ఇప్పటివరకు టీఎంసీజీ వివిధ రంగాలలో 149 నైపుణ్యాభివృద్ధి సెషన్లను విజయవంతంగా నిర్వహించిందని, తద్వారా వందలాది విద్యార్థులకు మార్గదర్శనం, పరిశ్రమ అనుభవం, ఉన్నత విద్యపై అవగాహన కలిగినట్టు డాక్టర్ రోజీనా మాథ్యూ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# పేదలకు గూడు కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**రూ.1 కోట్ల వ్యయంతో 30 ఇందిరమ్మ ఇండ్లకు శంకుస్థాపన**

**అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ**

**మహిళా సంఘాల ద్వారా ఆర్థిక సాధికారతకు ప్రాధాన్యం**



**ములుగు, అక్షిత న్యూస్:** ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తూ పేదలకు గూడు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. ములుగు జిల్లా మల్లంపల్లి మండలం ముద్దునూరు తండ గ్రామంలో రూ.1 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 30 ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత మంజూరు, శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి పాల్గొని లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు.

**ఇందిరమ్మ ఇండ్లతో పేద కుటుంబాలకు భరోసా**

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ముద్దునూరు తండలో తొలి విడతలో ఆరు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. రెండో విడతలో పైలట్ ప్రాజెక్టు కింద 24 ఇండ్లను ఎంపిక చేసి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశామని చెప్పారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సర్వే ఆధారంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసే ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేశారు.

సామాజిక భద్రతలో భాగంగా త్వరలోనే కొత్త పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపడతామని మంత్రి వెల్లడించారు. గ్రామాల్లోని అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలను ప్రజాప్రతినిధులు, సర్పంచుల ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ప్రతి మహిళ స్వయం సహాయక సంఘాల్లో సభ్యురాలిగా చేరాలని మంత్రి పిలుపునిచ్చారు.





మహిళా సంఘాల ద్వారా ఆర్థిక, సామాజిక ప్రయోజనాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. మహిళలకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందిస్తూ ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని తెలిపారు. మహిళలు సంఘాల్లో చేరితే ఇంట్లోనే ఒక బ్యాంక్ ఉన్నట్టేనని వ్యాఖ్యానించారు.

తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మంత్రి కోరారు. కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు, నాణ్యమైన విద్య, మెరుగైన ఫలితాలతో ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం బలోపేతం చేస్తోందని తెలిపారు.

**ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి**

జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. మంజూరైన ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రజా దర్బార్‌లో అందిన దరఖాస్తులను పరిశీలించి, ధృవీకరణ అనంతరం అర్హుల జాబితాను సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో వికాస్ మీనా, అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి., ఎం. సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బొక్క సత్తిరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, గ్రామాల సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తహసీల్దార్, ఎంపీడీఓ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చెంచు గిరిజనుల అభివృద్ధికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

**విద్య, వైద్యం, తాగునీరు, ఉపాధి అంశాలపై ప్రత్యేక దృష్టి**

**ఐటీడీఏ మన్ననూరులో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సమీక్ష**

**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఐటీడీఏ మన్ననూరు ప్రాజెక్టు పరిధిలో అమలవుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ వివిధ శాఖల అధికారులతో శుక్రవారం మన్ననూర్ ఐటిడిఏ కార్యాలయంలో సమగ్ర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. చెంచు గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న కలెక్టర్, చెంచు పెంటర్లలో అమలవుతున్న కార్యక్రమాల పురోగతిని శాఖల వారీగా సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ...... చెంచు గిరిజనులు, అత్యంత వెనుకబడిన గిరిజన వర్గాలవారి అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని, చెంచు కుటుంబాలకు విద్య, ఆరోగ్యం, తాగునీరు, పోషకాహారం, వనరులు, విద్యుత్, ఉపాధి అవకాశాలు వంటి ప్రాథమిక సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో





నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

విద్యాశాఖ పనితీరును సమీక్షిస్తూ చెంచు పెంటర్లలోని పిల్లలందరూ తప్పనిసరిగా పాఠశాలలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం, వసతి గృహాల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం అమలు, డ్రాప్‌అవుట్‌ల నివారణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, చెంచు విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రోత్సాహక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

వైద్య ఆరోగ్య శాఖ సమీక్షలో గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు అందుతున్న తీరును పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన వైద్య సేవలు, టీకాలు, పోషకాహార కార్యక్రమాలు క్రమం తప్పకుండా అందేలా చూడాలని, ప్రతి చెంచు పెంటకు ఆరోగ్య సిబ్బంది క్రమం తప్పకుండా వెళ్లి వైద్య సేవలు అందించడంతో పాటు సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలని వైద్య అధికారులను ఆదేశించారు.

తాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్, చెంచు పెంటర్లలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. పనిచేయని బోర్లు, పైపులైన్లు, నీటి సరఫరా వ్యవస్థలను వెంటనే మరమ్మతు చేసి ప్రజలకు నిరంతర నీటి సరఫరా కల్పించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

చెంచు యువత ఉపాధి అవకాశాల పెంపుపై ప్రత్యేకంగా దృష్టి సారించిన కలెక్టర్, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేయాలని సూచించారు. యువతకు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని తెలిపారు.

ఈ సమీక్ష సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, ఇంచార్జ్ డిటిడబ్ల్యుఓ ఉమాపతి, పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు, మిషన్ భగీరథ ఈఈ హేమలత ఐటీడీఏ ప్రాజెక్టు మేనేజర్ జాఫర్ హుస్సేన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## వస్త్ర సంచుల వినియోగాన్ని ప్రోత్సహిద్దాం

**సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలపై విస్తృత అవగాహన కార్యక్రమం**



**ములుగు, అక్షిత న్యూస్:** పర్యావరణ పరిరక్షణతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణకు వస్త్ర సంచులు, పునర్వినియోగ పాత్రల వినియోగాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సూచించారు. 99 రోజుల "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" కార్యాచరణలో భాగంగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ములుగు జిల్లాలో "వస్త్ర సంచులు మరియు పునర్వినియోగ పాత్రల ప్రోత్సాహం" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ), మున్సిపల్ చైర్‌పర్సన్, మున్సిపల్ కమిషనర్ పాల్గొని వస్త్ర సంచుల వినియోగాన్ని ప్రోత్సహించారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని వారు పేర్కొన్నారు.

అనంతరం తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ సైంటిస్ట్, నోడల్ అధికారి శ్రీమతి వి. అరుణ దేవి మున్సిపల్ కార్యాలయం, జిల్లా కార్మిక శాఖ అధికారుల సహకారంతో వ్యాపారులు, దుకాణదారులు, వినియోగదారులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాల వినియోగం, వ్యర్థాల తగ్గింపు చర్యలపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ సంచుల స్థానంలో వస్త్ర సంచులు, పునర్వినియోగ పాత్రలను ఉపయోగించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు సుస్థిర జీవన విధానాన్ని అలవర్చుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి, అలాగే బహిరంగ ప్రదేశాల్లో ప్రజలకు వస్త్ర సంచులను పంపిణీ చేసి పర్యావరణహిత జీవనశైలిపై అవగాహన కల్పించారు.

## విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ..

**ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలి - మాజీ కార్పొరేటర్ సాయిబాబా**



**శేరిలింగంపల్లి అక్షిత ప్రతినిధి :** శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ మధురా నగర్ కాలనీ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమ్మిరి శెట్టి సాయిబాబా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం మరియు రెండవ సంవత్సరం విద్యార్థులకు టెక్స్ట్ బుక్ లు పంపిణి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు టెక్స్ట్ బుక్ లు పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదువుకొని అధ్యాపకులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని కోరారు. సమాజంలో మంచిగా మెలుగుతూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమం లో ప్రధానాచార్యులు శ్రీనివాసులు, మరియు సభాధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, విద్యా కమిటీ అధ్యక్షులు కృష్ణ గౌడ్, ప్రవీణ్ ముదిరాజ్, రమేష్ గౌడ్ మరియు కళాశాల అధ్యాపక ఆధ్యాపాకేతర బృందం పాల్గొన్నారు.

## నిజామాబాద్--ఆలూరు బస్సు సౌకర్యం కల్పించాలి..!



**ఆర్మూర్, అక్షిత ప్రతినిధి:** మాక్లూర్ మండలంలోని చిన్నపూర్, కల్లడి గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ చిన్నపూర్ సర్పంచ్ పుప్పాల చిన్న, కల్లడి సర్పంచ్ గంగోల్ల సుస్మిత ప్రళయ్ తేజ్ శుక్రవారం నిజామాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ, తమ గ్రామాలకు సరైన బస్సు సౌకర్యం లేక మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా రోజువారీ అవసరాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు రవాణా సమస్యలతో అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు.

నిజామాబాద్ నుండి కల్లడి మీదుగా ఆర్మూర్ వరకు బస్సు సర్వీసు నడిపితే చిన్నపూర్, కల్లడి, ఆలూరు, గగ్గుపల్లి, ఇస్సపల్లి గ్రామాల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని సర్పంచ్ గంగోల్ల సుస్మిత ప్రళయ్ తేజ్ తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలని వారు అధికారులను కోరారు.

ఈ కార్యక్రమంలో గంగోల్ల ప్రళయ్ తేజ్, గంగోని వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలిద్దాం

**ఘనంగా ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం**

**జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీశైలం గౌడ్**




**అచ్చంపేట అక్షిత ప్రతినిధి:** బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరం కృషి చేయాలని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీశైలం గౌడ్ అన్నారు. శుక్రవారం లింగాల మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో యాక్సెస్ టు జస్టిస్ , కోనేరు ఎన్జీవో ఆధ్వర్యంలో గ్రామ ఉపసర్పంచ్ గుద్దటి కృష్ణయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు పిల్లలకు పనులలో పెట్టుకోవడం నేరమని . అభం శుభం తెలియని పిల్లలను పనిలో పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా పిల్లలపై లైంగిక వేధింపులు జరిపినచో ఏడు సంవత్సరాలు జైలు శిక్ష అనుభవిస్తారని అన్నారు. పిల్లలను ప్రమాదకర పనులలో పెట్టుకోవడం నేరమని. పెట్టుకున్న యజమాని పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. నాగర్కర్నూల్ పట్టణ కేంద్రంలో బైక్ మెకానిక్. దాబాలలో. సైకిల్ ట్యాక్స్. ట్రాక్టర్ షోరూమ్. హోటల్స్. టీ పెయింట్స్. తదితర వాటిలో పిల్లలను పెట్టుకుంటే బాల కార్మిక నిషేధ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలు ఉండే చోటు పాఠశాలలు. పిల్లలపై పని భారం వద్దే వద్దు అంటూ నినాదంతో ప్రతి ఒక్కరు పిల్లల హక్కులపై కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జి కృష్ణయ్య. పంచాయతీ కార్యదర్శి పాండు నాయక్. మాజీ సర్పంచి మరియు మాజీ ఎంపిటిసి మాచర్ల సుధీర్ గౌడ్. జిల్లా మహిళా సాధికారత కేంద్రం హబ్బు కోఆర్డినేటర్ సునీత. సఖి సెంటర్ కౌన్సిలర్ . కోనేరు ఎన్జీవో ఏరియా కోఆర్డినేటర్ జాకీర్ హుస్సేన్. వార్డు సభ్యులు బాలేశ్వరమ్మ బాలస్వామి మణెమ్మ . మాజీ వార్డు సభ్యులు యాదమ్మ. గ్రామ ప్రజలు కోడెల వెంకటస్వామి. శ్రీకాంత్. తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి

# పరిష్కారానికి కృషి చేస్తా

**మీ ఇంటి బిడ్డను...**

**చేనేత కార్మికులు ఆందోళన చెందవద్దు**

**ఆందోళన విరమింపజేసిన మంత్రి కొండా సురేఖ**



**వరంగల్, అక్షిత బ్యూరో:** వరంగల్ కొత్తవాడలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద చేనేత సహకార సంఘాల కార్మికులు చేపట్టిన శాంతియుత నిరసన కార్యక్రమంలో పాల్గొని మంత్రి సురేఖ వారి దీక్షను విరమింపజేసారు.



ఈ సందర్భంగా చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, వారి న్యాయమైన డిమాండ్లను తెలుసుకుని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చేనేత రంగంపై ఆధారపడిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందనే భరోసా కల్పించారు.

త్వరలోనే చేనేత కార్మికుల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసి తగిన పరిష్కారం దిశగా చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు .

కార్యక్రమంలో చేనేత సంఘాల కార్మికులు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**47వ డివిజన్ లో రూ.125 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన...**

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**





**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమం గురించి ధైర్యంగా ప్రజలకు చెబుతున్నామని పదేళ్ల పాలనలో మీరు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పగలరా అని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం రోజున 47వ డివిజన్ పరిధిలోని డీజిల్ కాలనీ, ఇంపీరియల్ కాలనీలలో రూ. 1.25 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకులు ప్రజల మౌలిక అవసరాలను పూర్తిగా విస్మరించారని, అభివృద్ధి పనుల గురించి మాట్లాడే నైతిక హక్కు వారికి లేదన్నారు. అభివృద్ధి చేయలేని వారు, ప్రజల సమస్యలను పట్టించుకోని వారు ఇప్పుడు అభివృద్ధి గురించి మాట్లాడటం చాలా హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు.వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్న ఆయన, కేవలం రెండున్నర సంవత్సరాల కాలంలోనే 47వ డివిజన్‌లో రూ.6 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేసినట్లు తెలిపారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాలు, వీధి దీపాలు తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.

అనంతరం పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో సంస్థాగత బలోపేతంపై దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , బూత్ ఏజెంట్ల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి బూత్‌లో పార్టీ బలాన్ని మరింత పెంచేందుకు నాయకులు సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

## తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆహార కల్తీపై అవగాహన కార్యక్రమాలు



**జగిత్యాల అక్షితబ్యూరో:** తెలంగాణ రాష్ట్రంలో ఆహార కల్తీ అరికట్టడానికి కృషి చేయాలని దక్షిణాది రాష్ట్రాల సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లెపాడు దామోదర్ కోరారు. జగిత్యాలలో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులు, వినియోగదారుల ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్న ఆయన వినియోగదారుల్లో చైతన్యం లేని కారణంగా నిరంతరం ఆహార కల్తీ విచ్చలవిడిగా పెరిగి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆహార కల్తీ చట్టాలు ఆయా చట్టాలకు రోజురోజుకు జరిగిన సవరణల పట్ల వినియోగదారుల ప్రతినిధులు, అధికారులతో కలిసి ముమ్మరంగా చైతన్య కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని డా.పల్లెపాడు దామోదర్ తెలిపారు. ఆహార కల్తీ ఎక్కువ శాతం వంట నూనెలు, కారంపొడి, మసాలా దినుసుల్లో జరుగుతున్నదని, బహుళ జాతి సంస్థలు కూడా అనుచిత వ్యాపార పద్ధతుల్లో కల్తీ ఆహార పదార్థాలను వినియోగదారులకు అంటగడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు మాట్లాడుతూ బహుళ జాతి వ్యాపార సంస్థలైన వివిధ షాపింగ్ మాల్స్, ఉచిత బహుమతులతో, డిస్కౌంట్లతో వినియోగదారులను తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు. ఒకటి కొంటే మరొకటి ఉచితం అని, కారంపొడి ప్యాకెట్లు, అల్లం పేస్టు, పసుపు ప్యాకెట్లను అంటగట్టడం పై వినియోగదారుల కోర్టులలో ఫిర్యాదులను నమోదు చేస్తున్నట్లు సాంబరాజు చక్రపాణి తెలిపారు. ఇదే సమావేశంలో పాల్గొన్న నిజామాబాద్ వినియోగదారుల సంక్షేమ సమితి రాష్ట్ర కార్యదర్శులు సందు ప్రవీణ్, మహాదేవుని శ్రీనివాసు, మహాదేవుని గణేశ్ లు ఆన్ లైన్ ఫుడ్ సంస్థల ఆహార కల్తీ పట్ల జాగ్రత్తగా ఉండాలని వినియోగదారులకు సూచించారు. అనంతరం ఉమ్మడి కరీంనగర్ జిల్లాల అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఖలీల్, కరీంనగర్, రంగారెడ్డి జిల్లా ఇన్స్పెక్టర్లు, సిరిసిల్ల జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ అనూష, జగిత్యాల జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ అనూష, ఇతర అధికారులకు వినియోగదారుల ప్రతినిధులు ఆయా ప్రాంతాల సమస్యలను విన్నవించారు.